నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
8 | ఖమ్మం, సోమవారం 17 ఫిబ్రవరి 2025 | BHADRADRI KOTHAGUDEM



ఖమ్మం ఆసుపత్రిలో కేసీఆర్‌కు నిమ్మరసం తాగిస్తున్న ప్రొఫెసర్ జయశంకర్, విద్యాసాగర్‌రావు, మంద కృష్ణ తదితరులు (ఫైల్)






- స్వరాష్ట్ర ఉద్యమంలో చారిత్రక ఘట్టంగా 'ఖమ్మం'
- ఉద్యమ స్వరూపాన్ని మార్చిన కేసీఆర్ ఆమరణ దీక్ష
- కరీంనగర్‌లో అరెస్టు.. ఖమ్మం జైలుకు తరలింపు..
- ఇక్కడి ప్రజలు గొంతెత్తడంతో ఉవ్వెత్తున ఎగిసిన ఉద్యమం
- తెలంగాణ ఏర్పాటులో కీలక మైలురాయిగా 'ఖమ్మం'
- ఉద్యమ గుమ్మంతో రాష్ట్ర సారథికి ఎనలేని అనుబంధం
- నేడు కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కథనం

# మలి మలుపుగా..

*ఒక ఉద్యమం ప్రపంచాన్ని ఆకర్షించింది. ఒక వ్యక్తి దీక్ష దేశ ప్రజలను ఆలోచింపచేసింది. ఒక నాయకుడి ఉపన్యాసం ప్రజలకు స్ఫూర్తినిచ్చింది. బక్క పలచటి వ్యక్తిపై అచెంచల విశ్వాసం పెట్టుకున్నది అప్పటి వరకూ అణగదొక్కబడిన ఆ ప్రాంతం. అందుకే.. ఆరు దశాబ్దాలు దోపిడీకి గురైన ఆ ప్రాంత ప్రజానీకం ఒక్క గొంతుగా నిలిచింది. ఆత్మహత్యలు, బలిదానాల సాక్షిగా తెగింపునకు సమరశంఖం పూరించింది. అలా పెల్లుబికిన స్వరాష్ట్ర కాంక్షను భుజానికెత్తుకున్నాడు ఆ బక్క పలచని వ్యక్తి. ఉద్యమానికి ఊపిరి పోసి చావోరేవో తేల్చుకొనేందుకు తెగించి ముందడుగు వేశాడు. తన దీక్షతో నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలనుకున్నాడు. ఆటుపోట్లకు వెరవలేదు. ఆమరణ దీక్షకు వెనుకాడలేదు. ఈ క్రమంలో లాఠీ దెబ్బలు తిన్నాడు. జైలు జీవితం గడిపాడు. చివరికి ఆ నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్షను నెరవేర్చాడు. వలస పాలనను పారదోలి స్వేచ్ఛావాయువులను ప్రసాదించాడు. ఆ తరువాత తెలంగాణకు పాలనాదక్షుడయ్యాడు. అభివృద్ధి ప్రదాతగా నిలిచాడు. సంక్షేమ సారథిగా కీర్తి గడించాడు. ఆ నాలుగు కోట్ల ప్రజల గుండెల్లో చెరగని ముద్రను వేసుకున్నాడు. యావత్ దేశ ప్రజలకు దార్శనికుడయ్యాడు. చరిత్రలో మరెవ్వరూ చెరపలేని చిరస్థానాన్ని పొందాడు. అతడే, ఆ బక్కపచని మనిషే.. మన కేసీఆర్ (కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు). నేడు ఆ ఉద్యమసారథి పుట్టిన రోజు (ఫిబ్రవరి 17) సందర్భంగా ప్రత్యేక కథనం.*

**- ఖమ్మం, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)**



వలస పాలకుల చేతిలో బంధీ అయిన తెలంగాణకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ప్రసాదించాలనుకున్నాడు ఉద్యమ సారథి కేసీఆర్. నీళ్లు, నిధులు, నియామకాల్లో ఆరు దశాబ్దాలుగా జరుగుతున్న అన్యాయంపై ఎలుగెత్తాడు ఈ తెలంగాణ ముద్దుబిడ్డ. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను ఏకం చేసి అహింసా మార్గంలో ఉద్యమానికి పురుడుపోశాడు ఈ మొండిఘటం. 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో..' అనే నినాదంతో మలి విడత ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు. అతడి సారథ్యంలో మలివిడత ఉద్యమం జోరుగా కొనసాగుతోంది. అప్పటికే 15 ఏళ్లు పూర్తయ్యాయి. ఇక తన దీక్షతోనైనా అప్పటి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలని తలిచాడు. వలస పాలనను పారదోలాలని సంకల్పించాడు. ఆమరణ దీక్షకు దిగాడు. దీనిని జీర్ణించుకోలేని వలస పాలకులు దీక్షను భగ్నం చేయాలనుకున్నారు. కరీంనగర్‌లో అరెస్టు చేశారు. తీసుకొచ్చి ఖమ్మం జైలులో నిర్బంధించారు. అక్కడ కూడా ఉద్యమసారథి తన దీక్షను కొనసాగించడంతో ఉద్యమం మరింత ఉవ్వెత్తున ఎగిసి పడింది. ఈ ఆ చారిత్రక ఘట్టానికి ఖమ్మమే వేదికైంది. ఆ తరువాతే 'తెలంగాణ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం' ప్రకటనకు బీజం పడింది.

## మలి విడతకు కేంద్రబిందువు ఖమ్మం

అది 2009 నవంబర్ 28వ తేదీ. మెదక్ జిల్లా సిద్దిపేట సమీపంలోని రంగదామ్‌పల్లిలో కేసీఆర్ ఆమరణ దీక్షకు వేదిక సిద్ధమైంది. కరీంనగర్ నుంచి వేదిక వద్దకు దాదాపు 159 వాహనాల భారీ కాన్వాయితో బయల్దేరి వెళ్లిన కేసీఆర్‌ను జిల్లా కేంద్రం పొలిమేర్లలోని అల్గునూర్ వద్ద అప్పటి వలస పాలకులు పోలీసులతో అరెస్టు చేయించారు. అక్కడి నుంచి వరంగల్ మీదుగా ఆంధ్రాలోని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించానుకున్నారు. ఖమ్మంలో తెలంగాణవాదం ఎక్కువగా ఉండదని భావించి పోలీసులు ఇటువైపు దారి మళ్లించారు. అదే రోజు ఖమ్మంలో న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. కేసీఆర్ సహా 9 మందికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం సబ్‌జైలుకు తరలించారు. బెయిల్ ప్రయత్నాలను కేసీఆర్ అంగీకరించలేదు. జైలు నుంచే దీక్షను కొనసాగిస్తున్నట్లు ప్రకటించడంతో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్నాయి. నవంబర్ 29న తెలంగాణ బంద్‌కు టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) పిలుపునిచ్చింది. అదే రోజు న్యాయవాది సుగుణారావు నేతృత్వంలో ఇద్దరు న్యాయవాదులు కేసీఆర్‌ను కలిసి మాట్లాడారు. బయటకు వచ్చి కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి క్షీణిస్తున్నట్లు చెప్పారు. సాయంత్ర ఖమ్మం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ పాపాలాల్ ఆధ్వర్యంలో డాక్టర్లు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు ధ్రువీకరించారు.

## ప్రభుత్వ వైద్యశాలలో కేసీఆర్..

నవంబర్ 30న కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని మరోసారి పరిశీలించిన డాక్టర్లు.. ఆయనను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసీఆర్ దీక్షను విరమించారని, ఆయన సూచన మేరకే పండ్ల రసం అందించామని అప్పటి ఏఎస్పీ పరిమళ ప్రకటించారు. అందుకు సంబంధించిన ఫొటోలను, వీడియో టేపులను పత్రికలకు విడుదల చేశారు. దీంతో సర్వత్రా నిర్ఘాంతపోయారు. అర్ధాంతరంగా దీక్షను విరమించడాన్ని సహించని ఓయూ విద్యార్థులు కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. అందుకు కేసీఆర్ స్పందించారు. పోలీసులు, వలస పాలకులు దురుద్దేశంతోనే తన దీక్షను భగ్నం చేసేందుకే కుట్ర పన్నారని స్పష్టం చేశారు. తాను దీక్ష కొనసాగిస్తున్నట్లు తేల్చి చెప్పారు. దీంతో విద్యార్థులు శాంతించారు. చల్లారి పోయిందనుకున్న అగ్గి రాజుకొని నిప్పులకొలిమై నింగినంటింది. ఉద్యమ స్వరూప స్వభావాన్నే మార్చివేసింది. ఉద్యమాల పురిటి గడ్డ ఖమ్మం వేదికగా జరిగిన ఈ ఘటన ఇప్పటికీ ఉద్యమ ప్రస్థానంలో ప్రధానంగా నిలిచిపోయింది.

## కేసీఆర్‌ని కలుస్తానని ఎప్పుడూ ఊహించలేదు..



2009 డిసెంబర్ 1న రాత్రి ఖమ్మం ఆసుపత్రిలో కేసీఆర్ కలిశాను. ఆ రోజు కేటీఆర్, హరీశ్‌రావును కూడా ఆసుపత్రిలోకి రానివ్వలేదు. ఆ సమయంలో నేను కేసీఆర్‌తోనే ఆసుపత్రిలో ఉన్నాను. నా ఫోన్ నుంచే మానవ హక్కుల చైర్మన్‌తోనూ, ఆనాటి సీఎం రోశయ్యతోనూ కేసీఆర్ మాట్లాడారు. బయటకు రాగానే పోలీసులు నా ఫోన్ లాక్కున్నారు. ఆ రోజున కేసీఆర్‌ను కలవడం, ఆయనతో ఉద్యమకారుడిగా కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నాను. అసలు కేసీఆర్‌ను కలుస్తానని జీవితంలో ఎప్పుడూ ఊహించలేదు.

**–బిచ్చాల తిరుమలరావు, న్యాయవాది, అప్పటి న్యాయవాద జేఏసీ చైర్మన్**

## కేసీఆర్ నన్ను తన కుటుంబ సభ్యుడిగా భావిస్తారు



కేసీఆర్ నన్ను తన కుటుంబ సభ్యుడిగా భావిస్తారు. ఆయన స్ఫూర్తితోనే 2008లో తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యజమాన్యాల సంఘాన్ని ఏర్పాటు చేశాను. ఖమ్మంలో ఆనాడు 'జై తెలంగాణ' అనేందుకు చాలామందికి ధైర్యం లేదు. అలాంటి సమయంలో తెలంగాణ పట్ల ఉన్న ప్రేమతో, కేసీఆర్ పట్ల ఉన్న అభిమానంతో ఖమ్మంలో తొలిసారి తెలంగాణ పేరుతో పాఠశాలల యూనియన్‌ను ఏర్పాటు చేయడం సాహసమే. కేసీఆర్ 2 సార్లు మా ఇంట్లో బస చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. **– ఆర్‌జేసీ కృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు**

## ఆనాడు కేసీఆర్ ఏ-1, నేను ఏ-2గా ఉన్నాం..



వలస పాలకులు కేసీఆర్‌పై దేశ ద్రోహం కేసు పెట్టి ఖమ్మం జైలుకు తరలించారు. ఆ కేసులో కేసీఆర్ ఏ–1గా, నేను ఏ–2గా ఉన్నాం. నాతోపాటు నాయిని నర్సింహారెడ్డి, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, డాక్టర్ విజయరామారావు, కన్నెబోయిన రాజయ్యయాదవ్ ఉన్నారు. వీరితోపాటు ఖమ్మానికి చెందిన బత్తుల సోమయ్య, గోపగాని శంకర్‌రావు, అబ్దుల్ నబీ కూడా జైల్లోనే ఉన్నారు. కేసీఆర్, నేను పక్క పక్క బెడ్‌లలోనే ఉన్నాం. మహత్తర ఉద్యమంలో ఆయన భాగస్వామిగా ఉండడంతో నా జీవితం సార్థకమైనట్లయింది.

**–డోకుపర్తి సుబ్బారావు, తెలంగాణ ఉద్యమకారుడు**

## కేసీఆర్‌తో కలిసి నడవడం పూర్వజన్మ సుకృతం..



తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్‌తో కలిసి నడవడాన్ని పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. ఆనాడు కేసీఆర్‌ను అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తీసుకెళ్తున్నప్పుడు మేం భయపడ్డాం. అక్కడ కేసీఆర్‌ను చంపుతారేమోననే అనుమానం కలిగింది. కేసీఆర్ లేకపోతే రాష్ట్రం రాదు. టీఆర్ఎస్ (ఇప్పుడు బీఆర్ఎస్) ఏమవుతుందోనన్న ఆందోళన మొదలైంది. ఆ తరువాత కేసీఆర్‌ను ఖమ్మం జైలుకు తీసుకురావడంతో మేమంతా రోడ్డెక్కి ఉద్యమించాం. లాఠీ దెబ్బలు తిన్నాం. ఖమ్మంలో టీఆర్ఎస్ మూడో సభ్యుడిని నేనే.

**–పగడాల నరేందర్, ఉద్యమకారుడు**

## కేసీఆర్ పుట్టిన రోజుకు పనసకాయలు వచ్చాయ్..

**రెండేళ్ల క్రితం ఇదే రోజున నాటిన రేపల్లెవాడ గ్రామస్తులు**



*సరిగ్గా రెండేళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజున భద్రాద్రి జిల్లా చంద్రుగొండ మండలం రేపల్లెవాడ గ్రామస్తులు గ్రామంలో పనస మొక్కను నాటారు. అది పెద్దదై నేడు కేసీఆర్ పుట్టినరోజు నాటికి కాయలతో కళకళలాడుతున్నది. గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు సత్తి నాగేశ్వరరావు ఇంటి ఎదురుగా ఈ మొక్కను నాటగా ఆదివారం గ్రామస్తులు కొందరు అక్కడకు చేరుకున్నారు. నాటి కేసీఆర్ సుపరిపాలనను గుర్తుచేసుకున్నారు.* **- చంద్రుగొండ, ఫిబ్రవరి 16**

### తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్ను..

## ఆనాటి కొత్తగూడెం సభ

**అప్పటి నుంచి కలిసి నడిచిన ఉద్యమకారులు**

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనూ చెరగని ముద్ర వేశారు. అప్పుడు ఉద్యమంలో దూసుకుపోయిన ఆయన వెంట నడిచిన నాయకులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చాలామందే ఉన్నారు. 2002లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇక్కడి ప్రకాశం స్టేడియంలో పెట్టిన సభను సక్సెస్ చేసేందుకు కొత్తగూడెం నియోజకవర్గం నుంచి యువ నాయకులు ముందుండి నడిచారు. తెలంగాణ పేరు చెబితేనే భయపడే ఈ ప్రాంతంలో జెండాలను భుజాన వేసుకుని ఉద్యమానికి ఊపిరిపోశారు. అదే సమయంలో సభకు వచ్చిన కేసీఆర్‌కు చేతికి విజయ చిహ్నంగా దట్టీని కట్టిన ఎండీ హుస్సేన్ నేటితరానికి ఉద్యమనేతగా నిలిచాడు. ఆయనతోపాటు తొగరు రాజశేఖర్, రాజుగౌడ్, మోరె భాస్కర్, పులి రామస్వామి సహా ఎంతో మంది ఉద్యమకారులు ఆనాడు కేసీఆర్ వెంట నడిచారు.

### సిద్దిపేట ఎన్నికలకు వాల్‌రైటింగ్..

తొలిసారిగా కేసీఆర్ సిద్దిపేట ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు సైతం కొత్తగూడెం నుంచి ఉద్యమకారులు ఆయన గెలుపు కోసం వాల్‌రైటింగ్ కూడా రాసిన సందర్భాలు ఉన్నాయి. అదే సమయంలో ప్రభుత్వ వంతెనలపై వాల్ రైటింగ్ రాసినందుకు పోలీసులు అరెస్టు కూడా చేశారు. తర్వాత కరీంనగర్ ఎన్నికలకు కూడా కొత్తగూడెం నుంచి ప్రచారానికి వెళ్లారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ నాయకత్వంలో కేసీఆర్‌కు అండగా నిలిచారు. తక్కువ మంది బలం ఉండడంతో కేసీఆర్‌తో ఎక్కువ సమయం గడిపారు.



2002లో కొత్తగూడెం సభలో ప్రసంగిస్తున్న ఉద్యమ నేత కేసీఆర్, తెలంగాణ సారథికి దట్టీ కడుతున్న ఉద్యమకారుడు హుస్సేన్ (ఫైల్)

## మాది 24 ఏళ్ల అనుబంధం..

- ఆదినుంచీ రాష్ట్ర సాధకుడితో అడుగులో అడుగునై సాగుతున్నా..
- 2001 ఏప్రిల్ 27న జలదృశ్యంలో పార్టీ పెట్టినప్పుడూ ఆయన వెంటే..
- ఉద్యమసారథి పుట్టిన రోజు సందర్భంగా 'దిండిగాల' అనుభవాలు..

ఇల్లెందు, ఫిబ్రవరి 16: ఉద్యమనేత కేసీఆర్‌తో తనది 24 ఏళ్ల అనుబంధమని చెప్పారు తెలంగాణ మలితరం ఉద్యమ నాయకుడు దిండిగాల రాజేందర్. కేసీఆర్ బంటుగా ఆదినుంచీ తాను రాష్ట్ర సాధకుడి బంటుగా కొనసాగుతున్నట్లు గుర్తు చేశారు. సోమవారం బీఆర్ఎస్ అధినేత, ఉద్యమ సారథి పుట్టిన రోజు సందర్భంగా ఉద్యమంలో ఆయనతో కలిసి నడిచిన దిండిగాల రాజేందర్ తన అనుభవాలను 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు. ఆ అనుభవాలన్నీ ఆయన మాటల్లోనే..



ఉద్యమ సమయంలో కేసీఆర్‌తో దిండిగాల (వృత్తంలో)

'వలస పాలనలో తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయంపైనా; నీళ్లు, నిధులు, నియామకాలపైనా కేసీఆర్ ఎంతో చలించిపోయారు. 2001 ఏప్రిల్ మొదటి వారంలో హైదరాబాద్ జలదృశ్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి నేను హాజరై తొలిసారి కేసీఆర్‌ను కలుసుకున్నాను. మళ్లీ అదే నెల 27న అక్కడే సభ పెట్టారు. తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేస్తున్నట్లు అదే సభలో కేసీఆర్ ప్రకటించారు. ఆయన పిలుపు మేరకు మే 11న ఉదయం 11 గంటలకు తెలంగాణలోని అన్ని గ్రామాల్లోనూ టీఆర్ఎస్ నాయకులం గులాబీ జెండాలను ఎగరవేశాం. ఇల్లెందులో నేనూ ఎగురవేశాను. ఆనాటి నుంచీ ఆయనతోనే సాగుతున్నాను. జీవితాంతమూ ఆయనతోనే సాగుతాను. పార్టీ ఆవిర్భావం తరువాత తొలిసారిగా కరీంనగర్‌లో సింహగర్జన పెట్టారు. దీనికి ఇల్లెందు నుంచి 12 జీపులు, 2 కార్లలో సుమారుగా 160 మందిమి బయలుదేరి వెళ్లాం. అప్పటి నుంచి ఆయన ప్రతి పిలుపునూ అనుకరిస్తున్నాను. 2009 నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్షకు మద్దతు తెలిపినందుకుగాను ఇల్లెందు పోలీసులు నన్ను, మరికొందరు ఉద్యమకారులను అరెస్టు చేశారు. ఆ తరువాత కేసీఆర్, జేఏసీ పిలుపు మేరకు ఇల్లెందులో దీక్ష నిర్వహించడానికి పలు కుల సంఘాలు ముందుకొచ్చాయి. వారిలో ఇల్లెందుకు చెందిన కంచర్ల శ్రీను అనే కుల వృత్తి చేసే వ్యక్తి గొంతెత్తాడు. 'తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్న నాయకుల ఇళ్లలో పనులకు వెళ్లం' అంటూ ప్రకటించాడు. ఇది రాష్ట్రంలో సంచలనమైంది.

# రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

- ప్రజల గుండెల్లో చెరగని ముద్ర కేసీఆర్‌ది
- బీఆర్ఎస్ అధినేత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించాలి
- జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఎర్రుపాలెం/ మధిర, ఫిబ్రవరి 16: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు అన్నారు. ఎర్రుపాలెం మండలంలో ఆదివారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం అయ్యవారిగూడెంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేలో మాజీ సీఎం కేసీఆర్ కుటుంబం పాల్గొనలేదని, వారి కుటుంబాన్ని వెలివేయాలని సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే మాట్లాడడం సమంజసం కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినప్పుడు అప్పటి ప్రతిపక్షంలో ఉన్న రేవంత్‌రెడ్డి ఏమి మాట్లాడారో ఒకసారి గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. సమగ్ర సర్వేను రాష్ట్ర ప్రజానీకం మొత్తం బహిష్కరించాలని మాట్లాడిన మాటలు మర్చిపోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందన్నారు. రాష్ట్ర ప్రజానీకానికి అబద్ధపు ఆరు గ్యారెంటీలను హామీలుగా ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆ హామీలను అటకెక్కించిందన్నారు. కళ్లు తెరిచి ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 17వ తేదీన సోమవారం కేసీఆర్ జన్మదినోత్సవాన్ని మధిర నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో ఘనంగా నిర్వహించాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల కార్యదర్శి యన్నం శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ శీలం కవిత, నాయకులు చిత్తారు నాగేశ్వరరావు, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కృష్ణారావు, తిరుపతిరావు, వెంకటనారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు. మధిరలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కమల్‌రాజు మాట్లాడుతూ కేసీఆర్ జన్మదినం సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

# సైక్లింగ్ పోటీలను ప్రారంభించిన కలెక్టర్

రామవరం, ఫిబ్రవరి 16 : జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లింగ్ పోటీలను నిర్వహించారు. కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఈ పోటీలను ప్రారంభించారు. బైపాస్ రోడ్ వద్ద జరిగిన ఈ పోటీల్లో రెండు కిలోమీటర్లు సైక్లింగ్‌లో పదేళ్ల విభాగంలో రుద్రంపూర్ సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల 4వ తరగతి విద్యార్థి మంద భవిత్ మెడల్ సాధించాడు. ఈ పోటీలను విద్యానగర్‌కాలనీ నుంచి బైపాస్ రోడ్ వరకు రెండు కిలోమీటర్ల దూరాన్ని నిర్దేశించారు. లక్ష్యాన్ని సునాయాసంగా భవిత్ చేరుకొని మొదటి బహుమతిని అందుకున్నాడు. విజేతకు ప్రశంసతోపాటు మెడల్‌ను అందజేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్